60

# అంతకు అంతే!

రాజారావు. నారాయణ... ఇద్దరూ పేద కుటుంబానికి చెందినవారే.

చిన్నతనం నుంచి ఎంతో స్నేహంగా ఉండేవారు. కలిసే చదువుకునేవారు. ఎక్కడికి పోయినా కలిసే తిరిగేవారు.

ఎంత ప్రయత్నించినా నారాయణ తండ్రికి – కొడుకుకి చదువు చెప్పించే స్థోమత లేక పోయింది. అందువల్ల కొడుకుని చదువు మాన్పించి స్కూటరు మెకానిక్ పనిలో ప్రవేశపెట్టాడు.

రాజారావు పెదనాన్నకు పిల్లలు లేరు. బోలెడు ఆస్తి ఉంది. ఆయనకి వయసు మీరడంతో రాజారావుని తీసుకు వెళ్లి పెంచుకుని మంచి చదువులు చెప్పించాడు.

పన్నెండేళ్ల తరువాత రాజారావు ఆ ఊరు వచ్చాడు.

ఆ విషయం తెలిసిన నారాయణ ఆనందానికి పట్టపగ్గాలు లేవు. 'ఎప్పుడెప్పుడు వెళ్లి బాల్యమిత్రుని చూడాలా...' అని ఎంతో ఆరాటపడ్డాడు.

మర్నాడు ప్రొద్దున్నే రాజారావు ఇంటికి వెళ్లాడు. రాజారావుకి ఆస్తి సంక్రమించి, పెద్ద చదువులు అబ్బడంతో విపరీతంగా గర్వం పెరిగిపోయింది.

నారాయణ వెళ్లేసరికి రాజారావు స్కూటర్ మీద ఎటో వెళ్లబోతున్నాడు.

రాజారావు రూపురేఖలు కూడా బాగా మారిపోయాయి. మనిషి బాగా పొడుగయ్యాడు. [illegible]టు చాయ వచ్చింది. ఖరీదైన బట్టల్లో మరింత మెరుస్తున్నాడు. రాజారావు ఆకారంలో మార్పు వచ్చినా నారాయణ తేలికగానే గుర్తు పట్టాడు. అతన్ని చూడగానే అతనికి వళ్లు ఆనందంతో ఊపశించిపోయింది. చిన్ననాటి మిత్రుని అమాంతం వెళ్లి గాఢంగా కౌగిలించుకోవాలనుకున్నాడు.

స్కూటర్ స్టార్ట్ చేయబోతున్న రాజారావుని చూస్తూ "ఒరేయి రాజా- నేనురా... నారాయణని!" అంటూ ఎదురు వెళ్లాడు నారాయణ.



ఒక మామూలు మనిషి - "ఒరేయ్" అని పిలుస్తూ తన దగ్గరకి రావడాన్ని భరించలేకపోయాడు రాజారావు. కోపాన్ని మనసులోనే అణచుకొంటూ నారాయణని గుర్తుపట్టి కూడా గుర్తుపట్టనట్లు నటిస్తూ "నువ్వెవరివైతే నాకేం? మర్యాద తెలీని వాళ్ళతో, మూర్ఖులతో నేను మాట్లాడను" అంటూ స్కూటర్‌ని స్టార్ట్ చేశాడు రాజారావు.

ఆ ప్రవర్తనకి ఒక్క క్షణం నివ్వెరపోయాడు నారాయణ. వెంటనే తేరుకుని, "నా మిత్రుడు ఎంతటి మూర్ఖుడైనా, పొగరుబోతైనా నేను మాట్లాడతాను" అన్నాడు.

రాజారావు అతని వంక ఒక్కసారి కోపంగా చూసి, స్కూటర్ మీద రయ్యిమంటూ వెళ్లిపోయాడు.

◎ ◎ ◎

మధ్యాహ్నం పదకొండు దాటింది.

నారాయణ తన షాపులో పని చేసుకుంటున్నాడు. ఆ ప్రాంతంలో స్కూటర్లు రిపేరు చేసే దుకాణం అదొక్కటే.

ఒక యువకుడు నానా అవస్థ పడుతూ స్కూటర్‌ని తోసుకుంటూ అక్కడకు వచ్చాడు.

"ఇది ఆగిపోయింది. ఏమైందో చూడు" అన్నాడు.

నారాయణ తలెత్తి అటు తిరిగి చూశాడు.

ఇద్దరి నోటివెంటా "నువ్వా!" అనే మాట ఒకేసారి వెలువడింది.

"పొగరుబోతులు, గర్విష్టులు, స్నేహితులను మరిచే వాళ్ళకి నేను రిపేరు చేయను" అంటూ తిరిగి తన పని చేసుకోసాగాడు నారాయణ.

★★★